

మట్టి దందా

చెరువు మట్టి తరలిస్తూ ఒకరు దందాకు తెరలేపారు. రాత్రివేళ ఇతర ప్రాంతాలకు పంపిస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. 8లో



జిల్లా పోలీస్ కార్యాలయం జిగేల్..

మెదక్ మున్సిపాలిటీ: రాష్ట్ర అవతరణ, దశాబ్ది వేడుకల సందర్భంగా జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు.

దరఖాస్తుల ఆహ్వానం

మెదక్ కలెక్టరేట్: ఎస్సీ విద్యార్థుల స్కాలర్‌షిప్ పునరుద్దరణ, కొత్త స్కాలర్‌షిప్‌ల కోసం ఈనెల 15లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి విజయలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా సంబంధిత ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు తమ కళాశాలలో అర్హత గల విద్యార్థులు పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్‌నకు దరఖాస్తు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

న్యూస్‌రీల్

త్రివర్ణపతాకం ఆవిష్కరించాలి



మట్లాడుతున్న శ్రీనివాస్

మెదక్‌జోన్: రాష్ట్రావతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఉదయం అన్ని మండల కేంద్రాల్లోని బీజేపీ కార్యాలయాల ఎదుట జాతీయపతాకాన్ని ఆవిష్కరించాలని ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గురువారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఆనాడు రాష్ట్రం కోసం బీజేపీ నాయకులు చేసిన పోరాటాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు నల్లాల విజయ్, మధు, ప్రసాద్, నిఖిల్, రాజు, వేణు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి



వినోద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్టీటీయూ నాయకులు

వెల్దుర్తి(తూప్రాన్): ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం చేయడంతో పాటు విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరికెల వెంకటేశం డిమాండ్ చేశారు. ఈ మేరకు పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు, ఉపాధ్యాయుల సమస్యలపై ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్‌కు రాష్ట్ర అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డితో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా ప్రతి ప్రాథమిక పాఠశాలలో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులను నియమించాలని కోరారు.

'ఆకాంక్షలను నెరవేర్చడంలో విఫలం'

నర్సాపూర్ రూరల్: ఉద్యమ ఆకాంక్షలను నెరవేర్చడంలో సీఎం కేసీఆర్ పూర్తిగా విఫలమయ్యారని టీపీసీసీ ప్రతినిధి ఆంజనేయులు గౌడ్ అన్నారు. గురువారం నర్సాపూర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. మిగులు బడ్జెట్‌తో ఉన్న రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చారని ఆరోపించారు. కేసీఆర్ పాలనలో ప్రజలకు ఒరిగిందేమి లేదన్నారు. ఏం సాధించారని దశాబ్ది ఉత్సవాలు చేస్తున్నారని ప్రశ్నించారు. ఉద్యమ ద్రోహులకు పదవులు కట్టబెట్టారని.. భూ దందా కోసం 111 జీఓను రద్దు చేశారన్నారు. దళితులకు ఇస్తానన్న మూడు ఎకరాల భూమి హామీని విస్మరించారని మండిపడ్డారు.

నేడు మెదక్‌కు మంత్రి తలసాని రాక

మెదక్ మున్సిపాలిటీ: నేడు రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి మెదక్‌కు రానున్నారు. మెదక్‌లో జరిగే రాష్ట్ర ఆవిర్భావ, దశాబ్ది ఉత్సవాల్లో పాల్గొననున్నారు. ఇందులో భాగంగా ఉదయం 8:30 గంటలకు చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని అమరవీరుల స్థూపం వద్ద పూలమాల వేసి నివాళులర్పిస్తారు. అనంతరం ఉదయం 9 గంటలకు మెదక్ కలెక్టరేట్ వద్ద నిర్వహించే రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరిస్తారు. అలాగే ఉదయం 11 గంటలకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మెదక్ నియోజకవర్గానికి చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తారు.

మల్కాపూర్‌లో పోస్టాఫీస్ ప్రారంభం

తూప్రాన్: మండలంలోని మల్కాపూర్ ఆదర్శ గ్రామంలో నూతన తపాలా శాఖ కార్యాలయాన్ని ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, జిల్లా తపాలా శాఖ సూపరింటెండెంట్ శ్రీహరితో కలిసి గురువారం ప్రారంభించారు. జనవరిలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి మల్కాపూర్ విచ్చేసిన మంత్రి హరీశ్‌రావు దృష్టికి గ్రామస్తులు తీసుకెళ్లారు. మంత్రి ప్రత్యేక చొరవతో గ్రామానికి నూతన తపాలా శాఖ సేవలు అందుబాటులోకి వచ్చాయి. కార్యక్రమంలో సర్పంచ్ మహాదేవి, ఎంపీటీసీ పంజాల వెంకటమ్మ, ఉప సర్పంచ్ ఆంజనేయులు గౌడ్, డీఎల్‌పీఓ శ్రీనివాసరావు, ఇన్‌చార్జి ఎంపీడీఓ రమేశ్, పోస్టల్ శాఖ సీఐ సందీప్, తదితరులు పాల్గొన్నారు.

ప్రగతి దిశగా పయనం

రవాణా రంగంలో పురోగతి
- జిల్లా మీదుగా నాలుగు జాతీయ రహదారులు, రైలు కూత
- నెరవేరని ఎన్‌డీఎల్‌ఎల్ ఫ్యాక్టరీ హామీ
- కొందరికే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు



మెదక్ రైల్వేస్టేషన్

మెదక్‌జోన్: ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుతో జిల్లాలో కొంతమేర చెప్పుకోదగ్గ అభివృద్ధి జరిగినప్పటికీ మరికొన్ని హామీలు నేటికీ నెరవేరలేదు. నూతన జిల్లా ఏర్పాటుతో పాటు రైలు కూత, నాలుగు జాతీయ రహదారులతో కొత్త రూపు సంతరించుకుంది. కాళేశ్వరంతో సాగు నీరు పరుగులు పెడుతుండగా.. సంక్షేమ పథకాలు పేదల దరి చేరాయి. అయితే ఎన్‌డీఎల్‌ఎల్ ఫ్యాక్టరీని ప్రభుత్వ పరం చేస్తామన్న హామీ నెరవేరకపోవడంతో పాటు పంటరుణాలు కొంతమందికే మాఫీ అయ్యాయి. అలాగే సమీకృత కలెక్టరేట్, మినీ ట్యాంక్‌బండ్ నిర్మాణాలు నత్తనడకన కొనసాగుతున్నాయి.

- రాష్ట్రం వచ్చిన రెండేళ్ల అనంతరం 2016లో మెదక్ జిల్లా ఏర్పాటుతో ఈ ప్రాంత ప్రజల కల నెరవేరింది. గతంలో మెదక్ పేరుతో జిల్లా ఉన్నప్పటికీ పాలన అంతా సంగారెడ్డి నుంచే కొనసాగింది.
- 1983లో మెదక్ నుంచి దివంగత ఇందిరాగాంధీ పోటీ చేసి ప్రధానిగా బాధ్యతలు చేపట్టినప్పటికీ అభివృద్ధికి నోచుకోలేదు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాతే మెతుకు సీమ అభివృద్ధిలో ప్రగతి సాధించింది.
- దశాబ్ద కాలంగా రైలు కూత కోసం ఎదురుచూసిన ప్రజల కల సొంతం అయింది. మెదక్ నుంచి అక్కన్నపేట వరకు సుమారు రూ. 250 కోట్లు ఖర్చు చేసి రైల్వేలైన్ వేశారు.
- అలాగే జిల్లావ్యాప్తంగా 1,870 చెరువు కుంటలను మిషన్ కాకతీయ ద్వారా రూ. 445 కోట్లతో మరమ్మతులు చేశారు.
- అంతేకాకుండా కాళేశ్వరం ద్వారా రామాయంపేట, నిజాంపేట, చిన్నశంకరంపేట, చేగుంట, వెల్దుర్తి మండలాల్లో కాలువల తవ్వకాలు చేపట్టి సాగునీరు అందించారు.
- జిల్లాలో 70 కిలోమీటర్ల పొడవు గల హల్దీవాగులోకి గోదావరి జలాలు మళ్లించి చెక్ డ్యాంలు నిర్మించారు.
- అయితే హల్దీవాగు నుంచి అభివృద్ధి పేరుతో ఇసుకను జోరుగా తరలిస్తున్నారు. దీంతో ఈ వాగుకు ప్రమాదం పొంచి ఉందనే చెప్పాలి.
- సంగారెడ్డి మీదుగా పెద్దశంకరంపేట, అల్లాదుర్గం, టేక్మాల్ మీదుగా నాదేండ్ వెళ్తుంది. నేషనల్ హైవే (44) హైదరాబాద్ నుంచి కాళ్లకల్, తూప్రాన్, చేగుంట, రామాయంపేట మీదుగా వెళ్తుంది.
- బాలానగర్ మీదుగా నర్సాపూర్, కొల్చారం, కౌడిపల్లి, మెదక్ నుంచి బోధన్.. మెదక్- ఎల్కతుర్తి ప్రధాన రహదారి సిద్దిపేట మీదుగా కరీంనగర్ వెళ్తుంది.
- ఈ రహదారులే కాకుండా జిల్లావ్యాప్తంగా రూ. 438.558 లక్షలు వెచ్చించి 265 కిలోమీటర్ల సింగిల్ రోడ్లను డబుల్ రోడ్లు మార్చి 4, 6 లేన్లుగా నిర్మించారు.
- మరికొన్ని బీటీ రెన్యూవల్ రోడ్లకు నిధులు మంజూరై ఏడాది కావొస్తున్నా కాంట్రాక్టర్లు టెండర్ వేసేందుకు ముందుకు రావడం లేదు.
- రాష్ట్ర ఏర్పాటుకు ముందు జిల్లావ్యాప్తంగా 82,662 మంది పింఛన్‌దారులకు నెలకు రూ. 8.63 కోట్లు అందించేవారు.
- రాష్ట్ర ఏర్పాటు అనంతరం అన్నిరకాల పింఛన్ లబ్ధిదారులు జిల్లాలో 1,16,882 మందికి గానూ నెలకు రూ. 26.07 కోట్లు పంపిణీ చేస్తున్నారు.
- జిల్లాలో మత్స్యకారులు 2014 ముందు జిల్లాలో 10 వేలు ఉండగా ప్రస్తుతం 17 వేల మంది ఉన్నారు.
- వీరికి సమీకృత మత్స్యాభివృద్ధి పథకం ద్వారా రూ. 20 కోట్లతో సబ్సిడీ వాహనాలు, వలలు అందించారు.
- అలాగే 2018 నుంచి రైతుబంధు ద్వారా 10 విడతల్లో 2,19,579 మంది రైతులకు 1,824.96 కోట్ల పెట్టుబడి సాయం అందించారు.
- రైతుబీమా ద్వారా 2018 నుంచి ఇప్పటివరకు 4,709 మంది రైతులు మృతిచెందగా రూ. 235.45 కోట్లను అందించి ఆదుకున్నారు.

కొంతమందికే పంట రుణాల మాఫీ

- రెండోసారి అధికారంలోకి వచ్చాక రూ. లక్ష లోపు రుణాలను ఏకకాలంలో మాఫీ చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చినప్పటికి కేవలం రూ. 25 వేల వరకు మాత్రమే మాఫీ చేసింది.
- మిగితా రైతులకు రుణ మాఫీ చేయకపోవడంతో బ్యాంకుల్లో వడ్డీ పేరుకుపోయింది.
- అలాగే 2014 ఎన్నికల సమయంలో అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఎన్‌డీఎల్‌ఎల్ ఫ్యాక్టరీని ప్రభుత్వం పరం చేసి నడిపిస్తామని.. ఈ ప్రాంతంలో మళ్లీ చెరకు పంటకు పూర్వవైభవం తెస్తామని కేసీఆర్ చెప్పారు. నేటికీ పదేళ్లు కావొస్తున్నా హామీగానే మిగిలిపోయింది.
- బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక కొంత మేర అభివృద్ధి పనులు జరిగినప్పటికీ మరికొన్ని హామీలు ఇప్పటికీ నెరవేరలేదనే చెప్పాలి.



అసంపూర్తిగా ట్యాంక్‌బండ్ నిర్మాణం

నత్తనడకన నిర్మాణాలు

- జిల్లాలో 4 వేల డబుల్ బెడ్రూంలు మంజూరు కాగా ఇప్పటివరకు కేవలం 2 వేల పైచిలుకు మాత్రమే లబ్ధిదారులకు అందించారు. మిగతావి నిర్మాణంలోనే ఉన్నాయి.
- కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాల నిర్మాణాలు కొనసాగుతున్నాయి. రాష్ట్రంలోని చాలా వరకు కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాల నిర్మాణాలు పూర్తయి వినియోగంలోకి వచ్చినా మెదక్‌లో మాత్రం నత్తనడకన సాగుతున్నాయి.
- మెదక్ పట్టణంలోని పిట్లబేస్, గోసముద్రం చెరువులను మినీ ట్యాంక్‌బండ్ చేస్తామని పనులు ప్రారంభించి ఏళ్లు గడుస్తున్నా నేటికీ పనులు పూర్తికాలేదు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా, పక్కన ఇన్‌చార్జ్ ఎస్పీ సింధుశర్మ

అవతరణ ఏర్పాట్లు పక్కాగా ఉండాలి

కలెక్టర్ రాజర్షిషా

మెదక్ కలెక్టరేట్: రాష్ట్ర అవతరణ, దశాబ్ది ఉత్సవాల ఏర్పాట్లు పక్కాగా ఉండాలని, అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని కలెక్టర్ రాజర్షిషా సూచించారు. గురువారం ఇన్‌చార్జి ఎస్పీ సింధుశర్మ, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, జిల్లా అధికారులతో కలిసి కలెక్టరేట్‌లో ఏర్పాట్లను పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఉత్సవాలకు ముఖ్య అతిథిగా రాష్ట్ర పశు సంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ హాజరవుతున్నట్లు చెప్పారు. ఉదయం 9 గంటలకు మంత్రి జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారని తెలిపారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించి జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రసంగిస్తారని చెప్పారు. అనంతరం అమరవీరుల కుటుంబాలకు సన్మానం, ప్రశంసపత్రాలను ప్రదానం చేస్తారన్నారు. అలాగే వివిధ శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించి లబ్ధిదారులకు రుణాలు పంపిణీ చేస్తారని వివరించారు. విద్యార్థులచే సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని డీఈఓకు సూచించారు.

రైతులను భాగస్వాములు చేయండి

కొల్చారం(నర్సాపూర్): రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 3వ తేదీన జిల్లాలోని 76 రైతు వేదికల్లో రైతు దినోత్సవం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. కార్యక్రమానికి విధిగా రైతులు పెద్ద సంఖ్యలో హాజరయ్యేలా చూడాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. గురువారం మండలంలోని పోతంశెట్టిపల్లి రైతు వేదికను సందర్శించి ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేశారు. రైతు వేదిక పరిసరాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దడంతో పాటు మామిడి తోరణాలు, విద్యుత్ దీపాలతో మూడు రోజుల పాటు అలంకరించాలని పేర్కొన్నారు. వేదిక ముందు రంగవల్లులతో అందంగా తీర్చిదిద్దాలన్నారు. వేదిక లోపల వ్యవసాయం రంగంలో సాధించిన విజయాలపై ఫ్లెక్సీలు, పోస్టర్లు ఏర్పాటు చేయాలన్నారు. వెయ్యి మందితో కార్యక్రమం నిర్వహించేలా వేదిక ఏర్పాటు చేయాలన్నారు. అందరికీ భోజనం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఓ శ్వేతకుమారి ఏఈఓ ప్రతిభ, తదితరులు పాల్గొన్నారు.



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



గౌడసంఘం భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ హేమలత

జెడ్పీ చైర్‌పర్సన్ ర్యాకల హేమలత

మనోహరాబాద్(తూప్రాన్): అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పని చేస్తుందని జెడ్పీ చైర్‌పర్సన్ ర్యాకల హేమలత శేఖర్‌గౌడ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో గౌడ సంఘం భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జెడ్పీ నిధుల నుంచి రూ. 20 లక్షల అంచనా వ్యయంతో గౌడ సంఘం భవన నిర్మాణానికి నిధులు మంజూరు కాగా మొదటి విడతగా రూ. 5 లక్షలు విడుదల చేసినట్టు తెలిపారు. సీఎం కేసీఆర్ అన్ని వర్గాల అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నారని కొనియాడారు. అంతకుముందు చిన్నశంకరంపేట మండలంలో అభివృద్ధి పనులకు సంబంధించి రూ. 21 లక్షల మంజూరు పత్రాన్ని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజుగౌడ్‌కు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎలక్షన్‌రెడ్డి, పీఆర్ డీఈ నర్సింలు, వైస్ ఎంపీపీ విఠల్‌రెడ్డి, ఏఈ మధు, ఎంపీటీసీ లతా వెంకట్‌గౌడ్, కో-ఆప్షన్ సభ్యుడు మునావర్, నాయకులు కృష్ణాగౌడ్, సురేందర్‌గౌడ్, సత్యనారాయణగౌడ్, నరేందర్‌గౌడ్, సాయిరాం, ఆత్మకమిటీ డైరెక్టర్ భిక్షపతి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



అమరవీరుల స్తూపం ముస్తాబు

చిన్నశంకరంపేట(మెదక్): తెలంగాణ ఉద్యమంలో ఎందరికో స్ఫూర్తిగా నిలిచిన మండల కేంద్రంలోని తెలంగాణ అమరవీరుల స్తూపం ఆవిర్భావ ఉత్సవాలకు ముస్తాబైంది. మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డితో పాటు జిల్లా అధికారులు అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించనున్నారు. అనంతరం ఇక్కడి నుంచి మెదక్‌లో నిర్వహించే కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో స్థానికులు అమరవీరుల స్తూపం నిర్మాణం చేపట్టారు. 2004లో రామాయంపేట ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో అప్పుడు కేంద్రమంత్రి హోదాలో కేసీఆర్ స్తూపాన్ని ఆవిష్కరించారు. జిల్లాలో ఏకైక అమరవీరుల స్తూపం ఇక్కడే ఉండడంతో ఆవిర్భావ ఉత్సవాలను సైతం ఇక్కడి నుంచే ప్రారంభిస్తున్నారు.

శాస్త్రీయ విద్యకై పోరాడుదాం

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి తాళ్ల నాగరాజు

మెదక్ కలెక్టరేట్: శాస్త్రీయ విద్యా విధానానికి పోరాడుదామని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి తాళ్ల నాగరాజు పిలుపునిచ్చారు. గురువారం మెదక్‌లో నిర్వహించిన ఎస్ఎఫ్ఐ రాష్ట్రస్థాయి విద్యా వైజ్ఞానిక శిక్షణ తరగతులకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యారంగంలో కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై విద్యార్థులను చైతన్య పరుస్తూ ఉద్యమిస్తున్నట్లు చెప్పారు. విద్యారంగంలో మార్పులు రావాలని దేశంలో అనేకమంది కోరుకుంటున్నారని తెలిపారు. ప్రభుత్వ విద్యను ప్రైవేటీకరణ చేసే దిశగా పాలకులు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, రాష్ట్ర సహాయ కార్యదర్శి కిరణ్, కన్వీనర్ పూజ, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ప్రవీణ్, సంతోష్, ఉపాధ్యక్షుడు జగన్, జిల్లా సహాయ కార్యదర్శులు అజయ్, శ్రావణి, జిల్లా కమిటీ సభ్యులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలకు గుర్తింపు

తూప్రాన్ సీహెచ్‌సీ, నర్సాపూర్ ఏరియా ఆస్పత్రికి కాయకల్ప అవార్డు



తూప్రాన్, నర్సాపూర్ రూరల్: తూప్రాన్ సీహెచ్‌సీ మెరుగైన సేవలతో రాష్ట్ర స్థాయిలో నిలిచింది. పారిశుధ్యం, వైద్య సేవలు అందించడం ద్వారా కాయకల్ప అవార్డు సొంతం చేసుకుంది. రూ. 15 లక్షల నగదు రివార్డు దక్కించుకుంది. 2022-23 ఆర్థిక సంవత్సరానికి గానూ నేషనల్ హెల్త్ మిషన్ తూప్రాన్ సీహెచ్‌సీకి ప్రకటించింది. పట్టణ కేంద్రంలో 2018లో 50 పడకల ఆస్పత్రిని సీఎం కేసీఆర్ ప్రారంభించారు. కార్పొరేట్ స్థాయిలో వైద్యం మౌలిక వసతులు, రోగులకు అందుతున్న వైద్య సేవలు, తదితర వాటిని పరిగణలోకి తీసుకున్న అధికారులు ఈ అవార్డును ప్రకటించారు. జిల్లాలోనే తూప్రాన్ సీహెచ్‌సీ ఆసుపత్రికి ప్రథమ అవార్డు రావడం సంతోషంగా ఉందని ఆసుపత్రి సూపరింటెండెంట్ అమర్‌సింగ్ అన్నారు. అందరి సమష్టి కృషి ఫలితంగానే అవార్డు దక్కిందన్నారు. అవార్డుతో బాధ్యత మరింత పెరిగిందన్నారు. అలాగే నర్సాపూర్ ఏరియా ఆసుపత్రికి కాయకల్ప అవార్డు దక్కింది. దీంతో ఆస్పత్రి సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

రావి ఆకుపై తెలంగాణ చిత్రాలు



రావి ఆకుపై శివకుమార్‌ మలిచిన చిత్రాలు



నారాయణఖేడ్‌: రాష్ట్రావతరణ దశాబ్ది ఉత్సవ వేళ.. మండల పరిధిలోని అనంతసాగర్‌కు చెందిన పత్ర చిత్రకారుడు గుండు శివకుమార్‌ రావి ఆకులపై తెలంగాణ తల్లి, తెలంగాణ చిత్రం, అమరవీరుల స్థూపం, వీరుల శక్తి, ఐక్యతాచిత్రం, చార్మినార్‌, గోల్కొండ, బిర్లామందిర్‌ చిత్రాలను మలచి శుభాకాంక్షలు తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

సంగారెడ్డి అర్బన్‌: జిల్లా కేంద్రంలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. టౌన్‌ సీఐ శ్రీధర్‌రెడ్డి కథనం ప్రకారం.. సంగారెడ్డి పట్టణంలోని ఇందిరాకాలనీలో గురువారం గుర్తుతెలియని వ్యక్తి మృతి చెంది ఉన్నాడని స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఆచూకీ తెలిసినవారు 08455-27633, 8712656718 ఫోన్‌ నెంబర్లకు సమాచారం ఇవ్వాలని సీఐ సూచించారు.

నకిలీ పురుగు మందుల వ్యాపారి రిమాండ్‌



విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న సీఐ నవీన్‌ కుమార్‌

సదాశివపేట రూరల్‌(సంగారెడ్డి): కొద్ది రోజులుగా పోలీసుల కళ్లు గప్పి తిరుగుతున్న నకిలీ పురుగుల మందుల వ్యాపారి ఉదయ్‌జైన్‌ను గురువారం పోలీసులు అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించారు. సదాశివపేట సీఐ నవీన్‌ కుమార్‌ పోలీస్‌స్టేషన్‌లో ఆ వివరాలు వెల్లడించారు. మండలంలోని ఆత్మకూర్‌ గ్రామానికి చెందిన ఉదయ్‌ కుమార్‌ జైన్‌ గ్రామంలో అలామా ట్రేడర్స్‌ పేరుతో విత్తనాలు, పురుగు మందుల వ్యాపారం నిర్వహిస్తున్నాడు. ఆత్మకూర్‌, పొట్టిపల్లి గ్రామ శివారులో ఎటువంటి అనుమతులు లేకుండా, కాలం చెల్లిన పురుగుమందులు, లూజు విత్తనాలు, నిషేధిత గడ్డి మందులు, గోడౌన్లలో నిల్వ ఉంచాడు. వీటితో పాటుగా కాలం చెల్లిన 33 రకాల ఆహార పదార్థాలు, శీతల పానీయాలు, చాక్లెట్స్‌, తేనె సీసాలు తదిరాలు నిల్వ చేయగా, వ్యవసాయ, ఫుడ్‌ సేఫ్టీ, పోలీసు అధికారులు సంయుక్తంగా దాడి చేసి ఐదు కేసులు నమోదు చేశారు. ఈ క్రమంలోనే కర్ణాటకలో ఉన్న ఉదయ్‌కుమార్‌ జైన్‌ అరెస్టు చేసి రిమాండ్‌ తరలించారు. రూ.4.50 కోట్ల విలువ గల విత్తనాలు, పురుగు మందులు స్వాధీనం చేసుకున్నారు. 30 లక్షల విలువైన కాలం చెల్లిన 33 రకాల ఆహార పదార్థాలు, శీతల పానీయాలు ధ్వంసం చేశారు. విలేకరుల సమావేశంలో ఎస్‌ఐ నాగలక్ష్మి తదితరులున్నారు.

మట్టి దందా


చెరువులో మట్టి తవ్వకాలు ఇలా..

- ప్రహరీ నిర్మించి..ఆపై నిల్వ చేసి
- రాత్రి వేళ నగరానికి తరలింపు

ములుగు(గజ్వేల్‌): చెరువుమట్టి తరలిస్తూ ఒకరు దందాకు తెరలేపారు. రాత్రివేళ ఇతర ప్రాంతాలకు పంపిస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. మేడ్చల్‌ జిల్లాలోని మైసమ్మగూడేనికి చెందిన ఒకరు మండలంలోని తున్కిబొల్లారం అయ్యప్పచెరువు, నాగుల చెరువు నుంచి ట్రాక్టర్లు, జేసీబీలతో మట్టిని తీయించి పరిసర గ్రామాల్లో గుట్టలుగా నిల్వ చేస్తున్నాడు. ఎకరం స్థలంలో చూట్టూ ప్రహరీ కట్టి మట్టినిల్వకు అడ్డాగా మార్చాడు. నిల్వచేసిన మట్టిని టిప్పర్లతో నగరానికి తరలిస్తూ లక్షలు ఆర్జిస్తున్నాడు. చెరువు మట్టిని కేవలం పొలాలకు మాత్రమే తరలించాల్సి ఉండగా, నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్‌ అవసరాలకు విక్రయిస్తున్నారు.

గ్రామస్తుల ఫిర్యాదు

తున్కిబొల్లారంలో అక్రమంగా చెరువు మట్టిని తవ్వి తరలిస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని, చెరువులను సంరక్షించాలని కోరుతూ గురువారం తున్కిబొల్లారం గ్రామస్తులు ములుగు తహసీల్దార్‌ ప్రవీణ్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. పీఏసీఎస్‌ వైస్‌ చైర్మన్‌ కుక్కల నరేష్‌గౌడ్‌, గ్రామస్తులు మధుసూధన్‌రెడ్డి, కిష్టారెడ్డి, మహేష్‌, బాబు తదితరులు విచారణ జరిగి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంపై తహసీల్దార్‌ ప్రవీణ్‌రెడ్డిని వివరణ కోరగా.. తున్కిబొల్లారం చెరువుల నుంచి అక్రమంగా మట్టి తరలిస్తున్న వ్యవహారంపై గ్రామస్తుల నుంచి ఫిర్యాదు అందిందన్నారు. విచారణ చేసి బాధ్యులపై తీసుకుంటామన్నారు.


తున్కిబొల్లారంలో నిల్వ చేసిన చెరువు మట్టి

బంధువుల పెళ్లికి వచ్చి... గుంతలో శవమై..


అశోక్‌ (ఫైల్‌)

జగదేవ్‌పూర్‌(గజ్వేల్‌): బంధువుల పెళ్లికి వచ్చిన ఓ వ్యక్తి గుంతలో శవమై తేలాడు. జగదేవ్‌పూర్‌ ఎస్‌ఐ కృష్ణమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రమైన దూళిమిట్టకు చెందిన లంబ అశోక్‌(26) బుధవారం జగదేవ్‌పూర్‌లో బంధువుల పెళ్లికి వచ్చాడు. బత్తుల ప్రభాకర్‌, శ్రీశైలం కలిసి కంబంబాయి కంచెలోకి వెళ్లారు. అక్కడ మద్యం సేవించిన అనంతరం అశోక్‌ మలవిసర్జన కోసం కంచె సమీపంలో గల గుంతలోకి వెళ్లారు. ప్రమాదవశాత్తు గుంతలో పడ్డాడు. గమనించిన స్నేహితులు అశోక్‌ కోసం వెతికారు. అదే సమయంలో తండ్రి శివ్వయ్య తన కుమారుడు అశోక్‌కు ఫోన్‌ చేయగా వస్తున్నానని చెప్పాడు. అరగంట తర్వాత మళ్లీ ఫోన్‌ చేస్తే స్విచ్‌ ఆఫ్‌ వచ్చిందని మృతుడి తండ్రి పేర్కొన్నాడు. రాత్రంతా అశోక్‌ ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు వెతికారు. గురువారం ఉదయం కంబం బాయి కంచెలోని గుంతలో శవమై కనిపించిందని చుట్టుపక్కల వారితో పోలీసులకు సమాచారం అందిందన్నారు. వెంటనే ఎస్‌ఐ కృష్ణమూర్తి సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీయించారు. కొడుకు మృతిపట్ల పూర్తి విచారణ చేసి న్యాయం చేయాలని మృతుడి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి ఆత్మహత్య


నవీన్‌ (ఫైల్‌)

బెజ్జంకి(సిద్దిపేట): ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ ప్రవీణ్‌రాజ్‌ తెలిపిన వివ రాల ప్రకారం.. మండల పరిధి లోని దాచారం గ్రామానికి చెంది న అడుకని నవీన్‌(28) గేదె పొలం వద్ద కట్టేసి వస్తానని చెప్పి గురువారం రాత్రి నుంచి బయలుదేరాడు. ఎంతకూ ఇంటికి రాక పోవడంతో ఆందోళనకు గురైన భార్య మమత ఫోన్‌ చేస్తే వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఉన్నానని చెప్పాడు. తర్వాత మళ్లీ ఫోన్‌ చేస్తే స్విచ్‌ ఆఫ్‌ వచ్చింది. దీంతో మమత గ్రామంలో వెతకగా డంపింగ్‌ యార్డులో చీరతో ఉరివేసుకుని మృతి చెంది కనిపించాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతికి కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి


హుస్నాబాద్‌ ప్రభుత్వ ఆస్పత్రి వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు, బంధువులు

హతమార్చారని తల్లిదండ్రుల ఆరోపణ

అక్కన్నపేట(హుస్నాబాద్‌): ఓ మూగ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. అయితే ఆ యువకుడి మృతిపై తల్లిదండ్రులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించారంటూ ఆరోపిస్తున్నారు. ఎస్‌ఐ తాండ్ర వివేక్‌ తెలిపిన వివరాల ప్రకారం... మండలపరిధిలోని నర్సింహతండాకు చెందిన మాలోతు రాజు–లలిత దంపతులకు ముగ్గురు సంతానం. రెండేళ్ల కిందటే ఐదేళ్ల కుమార్తె అనారోగ్యంతో మృతి చెందింది. పెద్దకుమారుడు మాలోతు ఆంజనేయులు(17)పుట్టుకతోనే మూగవాడు. బుధవారం తండాలో బంధువుల వివాహ వేడుక జరిగింది. మధ్యాహ్నం పెళ్లిలో భోజనం చేస్తున్న క్రమంలో ముగ్గురు భయపెట్టారని ఆంజనేయులు సైగల ద్వారా తన తల్లిదండ్రులకు వివరించాడు. రాత్రి 9గంటలు దాటినా ఇంటికి రాలేదు. చుట్టు పక్కల వెతకగా, ఎక్కడా ఆచూకీ దొరకలేదు. గురువారం తెల్లవారుజామున గౌరవెల్లి రిజర్వాయర్‌ సమీపంలో తమకున్న వ్యవసాయ క్షేత్రం దగ్గర కట్టవద్దకు వెళ్లి చూసేసరికి వేప చెట్టుకు ఆంజనేయులు శవం వేలాడుతూ ఉంది. విషయం తెలుసుకొని పలువురు సంఘటన స్థలానికి వచ్చారు. తండాకు చెందిన కిషన్‌కు రాజుకు కొంతకాలంగా భూతగదాలు నడుస్తున్నాయి. ఇటీవల ఇద్దరిపై కేసులు నమోదు అయ్యాయి. అయితే పాతకక్షల నేపథ్యంలో తమ కుమారుడిని హతమార్చారని ఆంజనేయులు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ సభ్యురాలు భూక్యమంగ హుస్నాబాద్‌ ప్రభుత్వ ఆస్పత్రిలో ఆంజనేయులు మృతదేహం వద్ద నివాళులు అర్పించారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.


మాలోతు ఆంజనేయులు (ఫైల్‌)

పాముకాటుకు రెండు ఆవులు మృతి




కోహిర్‌ (జహీరాబాద్‌): పాము కాటుకు రెండు ఆవులు మృతి చెందాయి. ఈ సంఘటన మండలములోని మనియార్పల్లిలో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. బాధిత రైతు అందించిన సమాచారం ప్రకారం... మండల పరిధిలోని మనియార్పల్లిలో రైతు గొల్ల బాగన్న తన రెండు ఆవులను వ్యవసాయ పొలం వద్ద కట్టేసి ఉంచాడు. పాము కాటుతో అస్వస్థతకు గురయ్యాయి. స్థానికంగా ఉన్న వారితో చికిత్స చేయించినా ఫలితం లేకుండా పోయింది. మరణించిన రెండు ఆవులు రూ.1.60లక్షలు ఉంటాయని రైతు వాపోయాడు.

పిడుగు పడి పాడిగేదెలు...


సంఘటన స్థలం వద్ద బాధితులు

వర్గల్‌(గజ్వేల్‌): పిడుగుపాటుకు చెట్టుకింద కట్టేసిన రెండు పాడిగేదెలు మృతి చెందాయి. వివరాలు ఇలా ఉన్నాయి..వర్గల్‌కు చెందిన రైతు ఉప్పరి నర్సింలు పొలం వద్ద చెట్టు కింద పాడిగేదెలను కట్టేసి పనుల్లో నిమగ్నమయ్యాడు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం పిడుగుపడింది. దీంతో చెట్టు కింద కట్టేసిన రెండు పాడిగేదెలు దుర్మరణం చెందాయి. ఈ ఘటనలో తనకు రూ.లక్షన్నర వరకు నష్టం వాటిల్లింది.

సైబర్‌ వలలో సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగులు

పటాన్‌చెరు టౌన్‌: పార్ట్‌టైం జాబ్‌ ఆఫర్‌ అంటూ అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చిన వాట్సాప్‌ మెసేజ్‌లకు స్పందించి ఇద్దరు సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగులు డబ్బు పోగొట్టుకున్నారు. అమీన్‌పూర్‌ పోలీసుల కథనం ప్రకారం..అమీన్‌పూర్‌ పరిధిలోని పీజీఆర్‌ ఎన్‌క్లేవ్‌కు చెందిన ఓ సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగినికి మే 24వ తేదీన పార్ట్‌ టైం జాబ్‌ ఆఫర్‌ అంటూ ఓ మెసేజ్‌ వచ్చింది. దీంతో ఆ మహిళ తన వివరాలు నమోదు చేసి నగదు పెడుతూ ఇచ్చిన టాస్క్‌లు పూర్తి చేసింది. చివరికి తాను పెట్టిన రూ.2.80లక్షలకు రెట్టింపై నగదు ఇవ్వాలని అడగగా స్పందన రాలేదు. దీంతో ఆ ఉద్యోగి తాను మోసపోయినట్టు గుర్తించి సైబర్‌ క్రైమ్‌లో ఫిర్యాదు చేసి అనంతరం అమీన్‌పూర్‌ పోలీస్‌స్టేషన్‌ లో ఫిర్యాదు చేసింది.

అమీన్‌పూర్‌ పరిధిలోని బంధంకొమ్ముకు చెందిన మరో సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగికి మే 24వ తేదీన పార్ట్‌ టైం ఉద్యోగం పేరిట ఓ మెసేజ్‌ వచ్చింది. దీంతో బాధితుడు తన వివరాలు నమోదు చేసి అపరిచిత వ్యక్తులు చెప్పిన విధంగా నగదు పెడుతూ, టాస్క్‌లు చేస్తూ వచ్చాడు. చివరకు తాను పెట్టిన రూ.2.63 లక్షలకు రెట్టింపు ఇవ్వాలని అడగగా స్పందించలేదు. దీంతో బాధితుడు తాను మోసపోయినట్టు గుర్తించి అమీన్‌పూర్‌ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి


గాలయ్య మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

కొండపాక(గజ్వేల్‌): చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందాడు. ఎస్‌ఐ పుష్పరాజ్‌ తెలిపిన వివరాల ప్రకారం..కుకునూరుపల్లి మండలంలోని సింగారానికి చెందిన గాలి గాలయ్య(40) కుటుంబీకులతో గజ్వేల్‌ మండలంలోని ముట్రాజ్‌పల్లి ఆర్‌అండ్‌ఆర్‌ కాలనీలో నివాసం ఉంటున్నాడు. ఈ నెల 29న కుకునూరుపల్లిలో బంధువుల ఇంటికి ద్విచక్ర వాహనంపై వెళుతున్నాడు. కొడకండ్ల గ్రామ శివారులో రాజీవ్‌ రహదారిపై చిన్న కిష్టాపూర్‌ క్రాస్‌ రోడ్డు వద్ద హైదరాబాద్‌ నుంచి సిద్దిపేట వైపునకు వెళుతున్న కారు అతివేగంగా ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలైన గాలయ్యను 108లో గజ్వేల్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం ఆర్వీఎం ఆస్పత్రికి తరలించారన్నారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


బోల్తాపడిన లారీ

ధాన్యం లారీ బోల్తా

దుబ్బాక: దౌల్తాబాద్‌ మండల పరిధిలోని తిర్మలాపూర్‌ వద్ద ధాన్యం లోడ్‌తో వెళుతున్న లారీ అదుపు తప్పింది. వివరాలు ఇలా ఉన్నాయి. గురువారం తిర్మలాపూర్‌ గ్రామంలో ఐకేపీ కొనుగోలు కేంద్రంలో 938 బస్తాలను లోడ్‌ చేసుకుని ఓ లారీ తొగుట మండలం ఎల్లారెడ్డి పేట రైస్‌మిల్లుకు బయలుదేరింది. ఈ క్రమంలోనే తిర్మలాపూర్‌ – హైమద్‌నగర్‌ గ్రామాలకు వెళ్లే దారిలో లారీ అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో లారీ డ్రైవర్‌ ఆరిఫ్‌ కాలు విరిగింది. చికిత్స నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సుమారు 150 బస్తాల ధాన్యం సంచులు పగిలిపోయాయి.

కారు ఢీ కొని ఒకరి మృతి.. ఇద్దరికి గాయాలు


పుష్ప మృతదేహాన్ని అంబులెన్స్‌లో ఎక్కిస్తున్న దృశ్యం

దుబ్బాకరూరల్‌: కారు చెట్టుకు ఢీ కొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా ఇద్దరికి గాయాలయ్యాయి. ఎస్‌ఐ గంగరాజు తెలిపిన వివరాల ప్రకారం..మెదక్‌ జిల్లా రామాయంపేట పట్టణానికి చెందిన దేవుని నర్సింలు తనభార్య పుష్ప(44), వదిన జెల్లా లక్ష్మిలతో కలిసి కారులో సిద్దిపేట జిల్లా బూర్గుపల్లి గ్రామంలో జరిగే బంధువుల పెళ్లికి హాజరయ్యారు. తిరిగి రామాయంపేటకు వస్తున్న క్రమంలో అక్బర్‌పేటభూంపల్లి మండలంలోని చిట్టాపూర్‌ శివారులోని రైస్‌మిల్లు వద్ద అతివేగంతో వెళుతున్న కారు రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీ కొట్టింది. దీంతో పుష్ప అక్కడికక్కడే మృతి చెందింది. నర్సింలు, జెల్లా లక్ష్మిలకు తీవ్రగాయాలయ్యాయి. గాయాలైన వారిని 108లో చికిత్స కోసం సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పుష్ప మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి కుమారుడు రంజిత్‌రాజ్‌ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



చెట్టును ఢీ కొట్టిన కారు

20 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్‌: డ్రంకెన్‌ అండ్‌ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సంగారెడ్డి కోర్టు జరిమానా విధించింది. న పటాన్‌చెరు ట్రాఫిక్‌ సీఐ ప్రవీణ్‌ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మంగళ , బుధ వారాల్లో నిర్వహించిన డ్రంకెన్‌ అండ్‌ డ్రైవ్‌ లో 20 మందిని పట్టుకున్నట్టు చెప్పారు. వారిని గురువారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా జడ్జి 19 మందికి ఒక్కొక్కరికి రూ.2 వేల చొప్పున జరిమానా, ఒకరికి రూ. 3 వేలు విధించారు.

నారాయణఖేడ్‌లో...

నారాయణఖేడ్‌: పట్టణంలో కొద్దిరోజులుగా పోలీసులు వాహనాలు తనిఖీలు నిర్వహించగా మద్యం సేవించి వాహనాలు నడుపుతూ 10మంది పట్టుబడ్డారు. వారిని జూనియర్‌ ఫస్ట్‌క్లాస్‌ మేజిస్ట్రేట్‌ కోర్టులో హాజరు పర్చగా న్యాయమూర్తి శ్రీధర్‌ రూ.35వేల జరిమానా విధించారని ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి గురువారం తెలిపారు. రెండోసారి మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడితే జైలుకు పంపిస్తామని హెచ్చరించారు.

వేర్వేరు ఘటనల్లో ముగ్గురు అదృశ్యం

సంగారెడ్డి జిల్లాలో వేర్వేరు చోట్ల .. వేర్వేరు కారణాలతో గురువారం ముగ్గురు అదృశ్యమయ్యారు.


ప్రదీప్‌ (ఫైల్‌)

సంగారెడ్డి మున్సిపాలిటీ: ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. సంగారెడ్డి సీఐ శ్రీధర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... పట్టణంలోని బాబానగర్‌కు చెందిన పంబాల ప్రదీప్‌కుమార్‌ వృత్తిరీత్యా ఆటోడ్రైవర్‌. రోజు మాదిరిగానే బుధవారం ఉదయం ఇంట్లో నుంచి ఆటో తీసుకొని కొత్తిమీర కోసం పటాన్‌చెరు వెళుతున్నానని చెప్పాడు. సాయంత్రం అయినా ఇంటికి తిరిగిరాలేదు. చుట్టుపక్కలవారికి, బంధువులకు ఫోన్‌ చేసినా ఆచూకీ లభించలేదు. దీంతో గురువారం ప్రదీప్‌కుమార్‌ తల్లి ప్రసన్న ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డ్యూటీకి వెళ్లి...


సతీష్‌ (ఫైల్‌)

పటాన్‌చెరు టౌన్‌: డ్యూటీకి వెళ్లిన తన భర్త తిరిగి ఇంటికి రాలేదంటూ ఓ భార్య ఫిర్యాదు చేసింది. భానూర్‌–బీడీఎల్‌ ఎస్‌ఐ మహేశ్వర్‌రెడ్డి కథనం ప్రకారం ..పటాన్‌చెరు మండలం చిటుకుల్‌ గ్రామ పరిధిలోని బాలజీ హోమ్స్‌కు చెందిన సతీష్‌ పాశ మైలారం పారిశ్రామికవాడలోని ఓ పరిశ్రమలో పనిచేస్తున్నాడు.రోజు మాదిరిగానే మే 30వ తేదీన సతీష్‌ రాత్రి డ్యూటీకి వెళ్లాడు. తిరిగి 31వ తేదీన ఇంటికి రాలేదు. భార్య శ్రీదేవి ఫోన్‌ చేయగా కొంచెం పనిఉందని పూర్తి చేసుకొని వస్తానని చెప్పాడు. తిరిగి సాయంత్రం నాలుగు గంటలకు ఫోన్‌ చేయగా స్విచ్‌ ఆఫ్‌ వచ్చింది. దీంతో భార్య శ్రీదేవి, కుటుంబసభ్యులు కలసి పరిశ్రమకు వద్దకు వెళ్లి అడగగా డ్యూటీ దిగి వెళ్లాదన్నారు. భర్త సతీష్‌ కోసం తెలిసిన వారి వద్ద, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. శ్రీదేవి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విందు ఉందని బయటకు వెళ్లి...


ఉదయ్‌కిరణ్‌(ఫైల్‌)

నారాయణఖేడ్‌: ఓ యువకుడు అదృశ్యమయ్యాడు. ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి చెప్పిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని సంజీవన్‌రావుపేట్‌ గ్రామానికి చెందిన ఉదయ్‌కిరణ్‌ (22) గతనెల 29న రాత్రి 8గంటల సమయంలో గ్రామంలో విందు ఉందని చెప్పి బయటకు వెళ్లాడు. అర్ధరాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు ఫోన్‌చేస్తే స్విచ్‌ఆఫ్‌ వచ్చింది. చుట్టుపక్కల, తెలిసిన వారివద్ద, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. యువకుడి తండ్రి బుజ్జం కిషన్‌ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేశారు.